క్లుప్తంగా

యువకులపై పోక్సో కేసు నమోదు

ఉండవెల్లి: మండలంలోని ఓ గ్రామానికి చెందిన ఇద్దరు యువకులు ఫోన్‌లో మైనర్‌తో అసభ్యకరంగా ప్రవర్తించడంపై బాధిత కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు పోక్సో కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ మహేష్ మంగళవారం తెలిపారు.

మద్యం తాగి వాహనం నడిపితే చర్యలు



ధరూరు: మద్యం తాగి వాహనం నడిపిన వారిపై చర్యలు తప్పవని ఎస్‌ఐ శ్రీహరి హెచ్చరించారు. మంగళవారం మండల పరిధిలోని నర్సన్‌దొడ్డి చౌరస్తాలో వాహన తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా డ్రంకెన్ డ్రైవ్ తనిఖీలు నిర్వహించారు. లైసెన్స్, ఆర్‌సీలు లేని వారితో పాటు మద్యం తాగి వాహనం నడిపిన వారికి జరిమానా విధించినట్లు తెలిపారు. వాహనదారులు రోడ్డు నిబంధనలు పాటించాలని సూచించారు. కార్యక్రమంలో పోలీసు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

లక్ష్యం మేరకు మొక్కలు పెంచాలి

మల్దకల్: ప్రభుత్వ లక్ష్యం మేరకు నర్సరీల్లో మొక్కలు పెంచేందుకు నిర్వాహకులు ప్రత్యేక దృష్టి సారించాలని ఎంపీఓ రాజశేఖర్ సూచించారు. మంగళవారం మండల పరిధిలోని వివిధ గ్రామాల్లోని నర్సరీలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఎంపీఓ మాట్లాడుతూ.. వేసవి బారి నుంచి మొక్కలు రక్షించేందుకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలన్నారు. అనంతరం ఆయా గ్రామాల్లో కొనసాగుతున్న ఉపాధి పనులను పరిశీలించారు. కూలీలు ఉపాధి పనులను సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో నర్సరీ నిర్వాహకులు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

రోగులకు నాణ్యమైన వైద్యం అందించాలి



మానవపాడు: రోగులకు నాణ్యమైన వైద్యం అందించాలని నేషనల్ క్వాలిటీ అస్యూరెన్స్ స్టాండర్ కమిటీ సభ్యులు శికాసింగ్, రాజేశ్వర్, బహుదేవుర్ పేర్కొన్నారు. మండలంలోని కలుకుంట్ల ఆరోగ్య కేంద్ర సిబ్బందితో వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడారు. ఆరోగ్య ఉపకేంద్రంలోని మౌలిక వసతుల గురించి ఆరా తీశారు. రోగులకు నాణ్యమైన వైద్యం అందించాలన్నారు. రోగులకు సంబంధించిన వివరాలు అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో ప్రోగ్రామ్ ఆఫీసర్ రిజ్వానా తాన్విర్, డాక్టర్ సింధు, డాక్టర్ యాకుబ్‌భాషా, పీఎచ్ఎన్ హెలెన్, చంద్రన్న, తిరుమల్‌రావు, మాబమ్మ, సోని, ప్రసన్న, సుభాషిని, అక్కమ్మ, తదితరులు పాల్గొన్నారు.

పెండింగ్ వేతనాలు చెల్లించాలి

ఆత్మకూర్: అంగన్‌వాడీ కేంద్రాల్లో విధులు నిర్వహిస్తున్న ఆయాలకు సంబంధించిన పెండింగ్ వేతనాలను వెంటనే విడుదల చేయాలని సీఐటీయూ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈసందర్భంగా సీఐటీయూ నాయకులు నాగరాజు, బొబ్బిలి నిక్సన్ మాట్లాడుతూ ఆత్మకూర్ ప్రాజెక్టు పరిధిలోని కొత్తకోట, ఆత్మకూర్, అమరచింత, మదనాపురం మండలాలకు సంబంధించి 2021 నుంచి ఆయాలకు వేతనాలు పెండింగ్‌లో ఉన్నాయన్నారు. అలాగే మినీ అంగన్‌వాడీ సెంటర్ల టీచర్లు, ఆయాలకు సంబంధించిన పది నెలల వేతనాలు పెండింగ్‌లో ఉన్నాయని వాపోయారు. అనంతరం పలు డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని సీఈపీఓకు అందజేశారు. కార్యక్రమంలో నాయకులు అరుణ, గాయత్రి, రామేశ్వరి, ప్రేమలత, సైదామీ, హుస్సేన్‌బీ, జయమ్మ, అనిత, కవిత, మధురిమ, ఇందిరమ్మ తదితరులు పాల్గొన్నారు.

బిందు సేద్యంతో నీటిఎద్దడి నివారణ

వీపనగండ్ల: రాష్ట్ర ప్రభుత్వం ఇస్తున్న సబ్సిడీని ఉపయోగించుకొని ఉద్యాన పంటల్లో బిందు సేద్యపు పరికరాలను ఏర్పాటు చేసుకోవడం వల్ల నీటి ఎద్దడిని నివారించొచ్చని మండల ఉద్యాన శాఖ అధికారి కృష్ణ అన్నారు. మంగళవారం మండల కేంద్రంలో బిందుసేద్యం పరికరాల పనితీరుపై రైతులకు పలు సూచనలు ఇచ్చారు. పండ్ల తోటలకు అవసరమైన ఫర్టిలైజర్‌ను కూడా బిందుసేద్యం పరికరాల ద్వారా అందించవచ్చన్నారు. ప్రభుత్వం అందిస్తున్న సబ్సిడీపై అవసరమైన సమాచారం కోసం ఉద్యానశాఖ అధికారులను సంప్రదించాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

అమ్మ 'ఆదర్శం'జాప్యం..!

- పాఠశాలల్లో నిలిచిన పనులు
- మరికొన్ని చోట్ల నత్తనడకన
- ఇబ్బందులు పడుతున్న విద్యార్థులు



ఉండవెల్లిలో నిధులు రాక నిలిచిన పాఠశాల నిర్మాణం

ఉండవెల్లి: పాఠశాలల్లో మౌలిక సదుపాయాల కోసం ప్రభుత్వం అమ్మ ఆదర్శ పాఠశాలలకు శ్రీకారం చుట్టింది. గత ప్రభుత్వం మన ఊరు–మన బడి కార్యక్రమంలో భాగంగా ప్రభుత్వ బడుల అభివృద్ధికి కృషి చేసింది. ప్రస్తుత ప్రభుత్వం కూడా అమ్మ ఆదర్శ పాఠశాలలకు నిధులు మంజూరు చేసినప్పటికీ పనుల్లో జాప్యం కొనసాగుతూనే ఉంది. దీంతో ఉపాధ్యాయులు, విద్యార్థులు ఇబ్బందులు పడుతూనే ఉన్నారు.

13 పాఠశాలు ఎంపిక

మండలంలోని 22 ప్రభుత్వ పాఠశాలల్లో అమ్మ ఆదర్శ పాఠశాలల కింద 13 పాఠశాలలను ఎంపిక చేశారు. గతంలో మన ఊరు– మన బడి పథకానికి 8 పాఠశాలలు మంజూరైన నిధులు రాకపోవడంతో నిర్మాణాలు నిలిపేశారు. విద్యార్థుల సంఖ్యను బట్టి ప్రభుత్వం నిధులు మంజూరు చేస్తుంది. గతేడాది నుంచి అభివృద్ధి పనులు ప్రారంభించారు.

ఏడాదిగా సాగుతున్న పనులు

పాఠశాలల్లో మరుగుదొడ్ల నిర్మాణం, మరమ్మతు పనులు, విద్యుత్ సౌకర్యం, ఫ్యాన్ల ఏర్పాటు, నీటి సంపుల నిర్మాణం, డైనింగ్ హాల్ తదితర కనీస వసతుల కోసం పనులు మొదలు పెట్టారు. ఏడాది నుంచి వివిధ పాఠశాలల్లో పనులు సాగుతూనే ఉన్నాయి. మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో డైనింగ్ హాల్ పనులు పూర్తి చేశారు. పుల్లూరు పాఠశాలలో మూత్రశాలల నిర్మాణం, కలుగోట్లలో సంపు పనులు, బొంకూరులో నీటి సంపులకు కనెక్షన్లు, తక్కశీలలో గోడలకు రంగులు, ఉండవెల్లిలో పాఠశాల నిర్మాణ పనులు, కంచుపాడులో మూత్రశాలకు పైకప్పు ఇలా పలు రకాల పనులు పూర్తి కావాల్సి ఉంది. నిధులు ప్రధానోపాధ్యాయుల బ్యాంక్ ఖాతాల్లోనే ఉండడంతో డీఈఓ వారిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. నిధులు డ్రా చేసి వేగంగా పాఠశాలలో పెండింగ్ పనులు పూర్తి చేయాలని ఓ సమావేశంలో ఆదేశించినట్లు సమాచారం.

బిల్లుల చెల్లింపులో జాప్యం

సకాలంలో బిల్లులు రావడం లేదని సదరు కాంట్రాక్టర్లు పనులు చేయడంలో జాప్యం చేస్తున్నారని ఆరోపణలు వినిపిస్తున్నాయి. మరికొన్ని పాఠశాలల్లో చిన్న చిన్న పనులు చేయడంలో కూడా నిర్లక్ష్యం కొనసాగుతోంది. పలు పాఠశాలల్లో వంట గదులు లేక వరండాలు, చెట్ల కిందనే వంటలు చేస్తున్న పరిస్థితి ఉంది.



బైరాపురంలో అస్తవ్యస్తంగా ఉన్న వంట గది



తక్కశిలలో రంగులు లేని గోడలు

సమస్యలు పరిష్కరిస్తాం..

అమ్మ ఆదర్శ పాఠశాల పథకం కింద మండలంలో 13 పాఠశాలలను ఎంపిక చేశారు. చిన్న చిన్న పనులకు మాత్రమే నిధులు మంజూరయ్యాయి. పుల్లూరు పాఠశాలలో కొన్ని సమస్యలు ఉన్నాయి. మన ఊరు– మన బడి నిధులు మంజూరు కావడం లేదు. ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి పాఠశాలల్లోని సమస్యలు పరిష్కరిస్తాం.

-భరత్ కుమార్, పంచాయతీరాజ్, ఏఈ

ఎన్నికల విజయంపై బీజేపీ సంబురాలు

అలంపూర్/రాజోళి/అయిజ: ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థి మల్క కొమరయ్య విజయం సాధించడంపై బీజేపీ నాయకులు ఉపాధ్యాయులతో కలిసి మంగళవారం సంబురాలు జరుపుకున్నారు. అలంపూర్‌లోని న్యూప్లాట్స్, బాలికల ఉన్నత పాఠశాల, హరిజనవాడ జెడ్పీహెచ్ఎస్ పాఠశాలలో ఉపాధ్యాయులకు కలిసి మిఠాయిలు తినిపించారు. బీజేపీ అభ్యర్థిని గెలిపించినందుకు కృతజ్ఞతలు తెలియజేశారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు శరత్ బాబు, నాగమల్లయ్య, రంగస్వామి, జగన్, పరశురాముడు, మద్దిలేటి, ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

✦ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీజేపి అభ్యర్థి కొమరయ్య గెలుపు పట్ల మంగళవారం మండల కేంద్రం రాజోళిలో సంబరాలు చేసుకున్నారు. బీజేపీ మండల అధ్యక్షుడు శశి కుమార్ ఆధ్వర్యంలో స్వీట్లు పంచి బాణా సంచా పేల్చారు. కార్యక్రమంలో సీనియర్ నాయకులు సంజీవ రెడ్డి, ఈసీ ఆంజనేయులు, కొంకతి రాము, మల్లేష్, రాము, గోవిందు రాజులు, వీరేష్ తదిదరులు పాల్గొన్నారు.



అయిజలో సంబరాలు చేసుకుంటున్న బీజేపీ నాయకులు

✦ ఎమ్మెల్సీగా బీజేపీ అభ్యర్థి గెలుపొందడంపై మంగళవారం అయిజ మండల కేంద్రంలో బీజేపీ నాయకులు సంబరాలు చేసుకున్నారు. ఈ సందర్భంగా బీజేపీ జిల్లా అధ్యక్షుడు రామచంద్రారెడ్డి మాట్లాడుతూ.. ఎన్నికల్లో విజయం సాధించిన బీజేపీ అభ్యర్థి మల్కా కొమరయ్యకు శుభాకాంక్షలు తెలియజేశారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు శివారెడ్డి, భగత్ రెడ్డి, గోపాల కృష్ణ, భీమసేన రావు, లక్ష్మణ్ గౌడ్, రఘు తదితరులు పాల్గొన్నారు.

నేడు లబ్ధిదారులకు చెక్కుల పంపిణీ

మానవపాడు/ఎర్రవల్లి/ఇటిక్యాల: మండలంలోని ఆయా గ్రామాల్లోని లబ్దిదారులకు బుధవారం అలంపూర్ చౌరస్తాలోని ఎమ్మెల్యే కార్యాలయంలో ఎమ్మెల్యే విజేయుడు ఆధ్వర్యంలో చెక్కుల పంపిణీ చేయనున్నట్లు తహసీల్దార్ జ్యోతి శ్రీనివాస్‌శర్మ మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. లబ్ధిదారులు సకాలంలో చెక్కులు పంపిణీ కార్యక్రమానికి హాజరుకావాలని సూచించారు.

✦ ఎర్రవల్లి మండల పరిధిలోని కల్యాణలక్ష్మీ, షాదీ ముబారక్‌కు దరఖాస్తు చేసుకున్న లబ్ధిదారులకు అలంపూర్ చౌరస్తాలోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో చెక్కులు పంపిణీ చేయనున్నట్లు తహసీల్దార్ నరేష్ ఒక ప్రకటనలో తెలిపారు.

✦ ఇటిక్యాల మండల పరిధిలోని కల్యాణలక్ష్మీ, షాదీముబారక్ కోసం దరఖాస్తు చేసుకున్న లబ్ధిదారులకు ఎమ్మెల్యే కార్యాలయంలో చెక్కులు పంపిణీ చేయనున్నట్లు తహసీల్దార్ భద్రప్ప ఒక ప్రకటనలో తెలిపారు.

రజతోత్సవాలను విజయవంతం చేద్దాం

అలంపూర్: బీఆర్ఎస్ పార్టీ రజతోత్సవాలను విజయవంతం చేద్దామని ఎమ్మెల్యే విజయుడు అన్నారు. కర్నూల్‌లోని ఎమ్మెల్సీ నివాసంలో బీఆర్ఎస్ పార్టీ రజతోత్సవాల వార్షిక క్యాలెండర్‌ను మంగళవారం ఎమ్మెల్యే ఆవిష్కరించారు. ఏప్రిల్ 27న బీఆర్ఎస్ వార్షికోత్సవాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఏడాదిపాటు బీఆర్ఎస్ ఉత్సవాలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో కలుగోట్ల పీఏసీఎస్ అధ్యక్షుడు గజేందర్ రెడ్డి, నాయకులు మజీద్ మియ్య తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి పరామర్శ

అయిజ: బీఆర్ఎస్ నాయకురాలు శరణమ్మ (70)అనారోగ్యంతో మృతి చెందారు. ఈ సందర్భంగా అలంపూర్ ఎమ్మెల్యే విజయుడు మంగళవారం పట్టణంలోని మృతురాలి నివాసానికి వెళ్లి ఆమె మృతదేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించారు. కార్యక్రమంలో నాయకులు నరసింహులు, మల్లికార్జున్‌రెడ్డి, వెంకటేష్, పల్లయ్య, శ్రీను, మురళి, కార్యకర్తలు పాల్గొన్నారు.



క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే విజయుడు

ప్రజావేదికతో ముగిసిన సోషల్ ఆడిట్

అయిజ: మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం ద్వారా మండలంలో ఈఏడాది నిర్వహించిన పనులపై పది రోజుల పాటు నిర్వహించిన 14వ విడత సోషల్ ఆడిట్ కార్యక్రమం మండల కేంద్రంలో నిర్వహించిన ప్రజావేదిక కార్యక్రమంతో ముగిసింది. మంగళవారం ఎంపీడీఓ కార్యాలయం ఆవరణలో నిర్వహించిన ప్రజా వేదిక కార్యక్రమంలో డీఆర్‌డీఓ నర్సింగరావు, ఏపీఓ శ్రీనివాసులు, ఎంపీడీఓ వెంకటయ్య, ఎస్ఆర్‌పీ బాలునాయక్, డీఆర్‌పీ శివశంకర్ పాల్గొని వివరాలు వెల్లడించారు. 2023 ఏప్రిల్ నుంచి 2024 మార్చి వరకు చేపట్టిన ఈజీఎస్ పనులపై నిర్వహించిన సోషల్ ఆడిట్ నివేదికను అధికారులు వివరించారు. ఈజీఎస్ పనులు చేసిన ఉపాధి కూలీలకు మొత్తం రూ.3.77 కోట్లు ఖర్చు చేయగా వాటిలో రూ.25 లక్షలు పనిముట్ల కోసం ఖర్చు చేసినట్లు తెలిపారు. ఈ సందర్భంగా డీఆర్‌డీఓ నర్సింగరావు మాట్లాడుతూ.. ఈజీఎస్ పనుల్లో భాగంగా కొన్ని గ్రామాల్లో సిబ్బంది నిర్లక్ష్యం వహించినట్లు సోషల్ ఆడిట్‌లో బయటపడినట్లు తెలిపారు. విధుల్లో పారదర్శకత పాటించకపోవడం, అవినీతికి పాల్పడిన వారికి నోటీసులు జారీ చేస్తామని, త్వరలో చట్టరీత్యా చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో క్వాలిటీ కంట్రోల్ అధికారులు చాముండేశ్వరి, ఈసీ అశోక్, ఈఆర్‌పీలు, కార్యదర్శులు, టెక్నికల్ అసిస్టెంట్లు, ఫీల్డ్ అసిస్టెంట్లు, ప్రజలు పాల్గొన్నారు.



ప్రజా వేదిక కార్యక్రమంలో అధికారులు

మహిళా దినోత్సవాన్ని జయప్రదం చేద్దాం

అలంపూర్: ఈనెల 8న నిర్వహించనున్న అంతర్జాతీయ మహిళా దినోత్సవ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు రాజు ఒక ప్రకటనలో కోరారు. జిల్లా వ్యాప్తంగా మహిళల హక్కులు పరిరక్షించడానికి, లింగ వివక్షత రూపుమాపడానికి సీపీఎం పార్టీ అధ్వర్యంలో కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. అదే విధంగా స్వాతంత్య్ర ఉద్యమంలో దేశం కోసం ప్రాణ త్యాగాలు చేసిన సమరయోధులు భగత్ సింగ్, సుకుదేవ్ రాజ్ వర్ధంతి కార్యక్రమం ఈనెల 23న నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు.

అలరించిన చింతామణి నాటక ప్రదర్శన



రాజోళి: మండల కేంద్రంలోని భ్రమరాంబ అడివేశ్వర స్వామి జాతర సందర్భంగా పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. వేడుకల్లో భాగంగా సోమవారం అర్ధరాత్రి నుంచి మంగళవారం ఉదయం వరకు అద్దంకి నుంచి వచ్చిన కళాకారులు ప్రదర్శించిన భక్త చింతామణి నాటకం అలరించింది. ఈ సందర్భంగా కళాకారులను పలువురు అభినందించారు. శాలువా, పూల మాలలతో సన్మానించారు. కార్యక్రమంలో నిర్వాహకులు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యలపై నిరంతర పోరాటం

అమరచింత: గ్రామాల్లో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కరించాలంటూ సీపీఎం ఆధ్వర్యంలో నిరంతరం పోరాటం చేస్తామని ఆ పార్టీ మండల కార్యదర్శి జీఎస్ గోపి, నాయకులు వెంకటేష్, అజయ్ అన్నారు. పార్టీ రాష్ట్ర కమిటీ ఆదేశాల మేరకు గ్రామ సమస్యలపై పార్టీ పరంగా సర్వే చేపడుతున్నామన్నారు. మార్చి చివరి నాటికి సమస్యలపై సర్వే నిర్వహిస్తామని తెలిపారు. మండలంలోని కొంకన్‌వానిపల్లి గ్రామంలో మంగళవారం కాలనీల్లో తిరుగుతూ సమస్యలను గుర్తించామన్నారు. గ్రామంలో అద్దె భవనంలో అంగన్‌వాడీ కొనసాగుతుందని పేర్కొన్నారు. సీసీ రహదారుల సమస్య వేధిస్తున్నా అధికారులు గత పాలకులు పట్టించుకోకపోవడం దారుణమన్నారు. గ్రామంలో డ్రెయినేజీ వ్యవస్థ సరిగా లేకపోవడంతో మురుగు రహదారులపై పారుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. గ్రామ ప్రజలకు సాగు నీరు లేక పంటలు పండించుకోలేక తమ వ్యవసాయ భూములు బీడుగా వదిలేస్తున్నారని, ఎత్తిపోతల పథకం చేపట్టి సాగునీరు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ స్థలాలు ప్రైవేట్ వ్యక్తులు కబ్జా చేస్తున్నారని అలాంటి వారిపై చర్యలు తీసుకోవాలని కోరారు. ఆసరా పెన్షన్ల కోసం వృద్ధులు, దివ్యాంగులు, వితంతువులు సమీపంలోని అమరచింతకు వెళ్లాల్సిన పరిస్థితి కల్పించడం ఏమిటన్నారు. గ్రామ సమస్యలను పరిష్కరించాలంటూ ఈనెల 9న పంచాయతీ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో మహేష్, మొగిలి, అంజిరెడ్డి, మోహన్, నాగరాజు, శివ, హరీశ్ తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీల అక్రమ నిర్బంధాలు ఆపాలి

అలంపూర్: ప్రభుత్వం తక్షణమే అంగన్‌వాడీ టీచర్ల అక్రమ నిర్బంధాలను ఆపాలని అంగన్‌వాడీ టీచర్స్ హెల్పర్స్ యూనియర్ జిల్లా కార్యదర్శి ఏమేలమ్మ అన్నారు. పట్టణంలోని అంగన్‌వాడీ టీచర్లను పోలీసులు మంగళవారం గృహ నిర్బంధం చేశారు. అంగన్‌వాడీ టీచర్స్, హెల్పర్స్ తమ సమస్యల పరిష్కారం కోరుతూ హైదరబాదులోని ప్రజా దర్బార్‌లో వినతిపత్రం అందజేయడానికి పిలుపునిచ్చారు. ఈ నేపథ్యంలో పోలీసులు అంగన్‌వాడీ టీచర్లు, హెల్పర్లను గృహ నిర్బంధం చేసినట్లు తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా కార్యదర్శి మాట్లాడుతూ...అంగన్‌వాడీల్లో మినీ టీచర్స్‌ను మెయిన్ టీచర్లుగా గుర్తించి ఏడాది అవుతుందని కానీ ఇప్పటి వరకు మిని టీచర్ల జీతాలు ఇస్తున్నట్లు తెలిపారు. ఐదేళ్లుగా అంగన్‌వాడీ కేంద్రాల్లో ఆయా పోస్టులు ఖాళీగా ఉన్నాయని, పని ఒత్తిడి, ఆర్థిక సమస్యలతో కొట్టుమిట్టాడుతున్నట్లు పేర్కొన్నారు. సమస్యల పరిష్కారానికి వినతిపత్రం ఇవ్వాలని భావించిన అంగన్‌వాడీలను ముందస్తుగా గృహ నిర్బంధం చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నట్లు అన్నారు. వేసవి సెలవులు ప్రభుత్వ పాఠశాలలతోపాటు అంగన్‌వాడీలకు ఇవ్వాలని డిమాండ్ చేశారు. మే నెల మొత్తం లబ్ధిదారులకు టీహెచ్ఆర్ పంపిణీ చేసే విధంగా ప్రభుత్వం సూచనలు చేయాలని కోరారు. కార్యక్రమంలో అంగన్‌వాడీలు తదితరులు పాల్గొన్నారు.



అలంపూర్‌లో అంగన్‌వాడీ టీచర్ల ఇళ్ల వద్ద పోలీసులు

ఇంటర్ పరీక్షలకు ఏర్పాట్లు పూర్తి

గట్టు/మల్దకల్: ఇంటర్మీడియేట్ పరీక్షలకు సంబంధించి ఏర్పాట్లను పూర్తి చేసినట్లు చీఫ్ సూపరింటెండెంట్ కేఎస్‌డీ రాజు, డిపార్టుమెంటల్ అధికారి కాశీ విశ్వనాథ్ తెలిపారు. మంగళవారం గట్టులోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో అధికారులు బుధవారం నుంచి జరుగనున్న పరీక్షలకు సంబంధించి ఏర్పాట్లను పరిశీలించారు. సాంఘీక సంక్షేమ గురుకుల ఇంటర్, మానవపాడు గురుకుల ఇంటర్, కస్తూర్బాలో ఇంటర్ చదువుతున్న విద్యార్థులు హాజరు కానున్నట్లు అధికారులు పేర్కొన్నారు.

✦ మల్దకల్ మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్ పరీక్షలకు సంబంధించిన ఏర్పాట్లను చీఫ్ సూపరింటెండెంట్ గోవర్ధన్‌శెట్టి, డిపార్ట్‌మెంటల్ అధికారి శ్రీరాములు పరిశీలించారు. విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ఏర్పాట్లు చేయాలన్నారు. కార్యక్రమంలో అధ్యాపక సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



గట్టులో ఏర్పాట్లను పరిశీలిస్తున్న అధికారులు

సృజనాత్మకతను వెలికితీసేందుకు దోహదం

కేటీదొడ్డి: విద్యార్థుల్లో దాగి ఉన్న సృజనాత్మకతను వెలికితీసేందుకు సబ్జెక్ట్ మేళా ఉపయోగపడుతుందని హెచ్ఎం ఉస్సేన్ అన్నారు. మంగళవారం మండలంలోని ఇర్కిచేడు పాఠశాలలో ఎంవీ ఫౌండేషన్, మండల విద్యాశాఖ ఆధ్వర్యంలో మండల స్థాయి సబ్జెక్ట్ మేళా నిర్వహించారు. తెలుగు, ఇంగ్లిష్, గణితం, సామాన్య శాస్త్రం సబ్జెక్ల వారీగా మూడో తరగతి నుంచి ఐదవ తరగతి వరకు విద్యార్థులు వివిధ రకాలైన టీఎల్ఎం మెటీరియల్ ప్రదర్శించారు. ఇలాంటి కార్యక్రమాలు నిర్వహించడం వల్ల విద్యార్థుల్లో ఆలోచన శక్తి పెరుగుతుందని హెచ్ఎం అన్నారు. కార్యక్రమంలో ఎంవీఎఫ్ పౌండేషన్ సభ్యులు, ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.



సబ్జెక్ట్ మేళాలో ఉపాధ్యాయులు

డబ్బులు వసూలు చేస్తే చర్యలు

అయిజ: ఇంటి నంబర్ ప్లేట్ అమర్చినందుకు డబ్బులు వసూలు చేయడంపై కాంట్రాక్ట్ సిబ్బందిని మున్సిపల్ అధికారులు హెచ్చరించారు. మున్సిపల్ పరిధిలోని వివిధ కాలనీల్లో ఇంటి నంబర్ ప్లేట్లు అమర్చుతున్న కాంట్రాక్ట్ సిబ్బంది ఇంటికి నంబర్ ప్లేట్లను అమర్చేందుకు ప్రజల నుంచి డబ్బు వసూలు చేయరాదని ఆదేశాలు జారీచేసినా మున్సిపాలిటీలోని 3వ వార్డులో మంగళవారం కాంట్రాక్టర్ సిబ్బంది ఇంటికి రూ.60 చొప్పున వసూలు చేస్తుండడంతో మున్సిపల్ ఆర్ఐ విజయ్, ఆర్ఓ లక్ష్మన్న, బిల్ కలెక్టర్ ఆంజనేయులు కాంట్రాక్టర్ సిబ్బందిని అడ్డుకున్నారు. ప్రజల నుంచి డబ్బులు తీసుకుంటే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



కాంట్రాక్టర్ సిబ్బందిని హెచ్చరిస్తున్న మున్సిపల్ అధికారులు

విద్యార్థులకు బ్యాగుల పంపిణీ

గద్వాలటౌన్: మండల పరిధిలోని గుంటిపల్లి ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు జేఎస్‌డబ్ల్యూ, అభినవమిత్ర సోలార్ పవర్ ప్లాంట్, సంకల్ప స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో బ్యాగులు పంపిణీ చేశారు. మంగళవారం పాఠశాలలో ఆయా సంస్థల ప్రతినిధులు సంతోష్, రాజరాజేశ్వరి, కిషోర్, షాలిని, ఉపేందర్ విద్యార్థులకు బ్యాగులతో పాటు పుస్తకాలు, జామెట్రీ బాక్స్, తదితర కిట్లు అందజేశారు. కార్యక్రమంలో హెచ్ఎం ప్రభాకర్, ఉపాధ్యాయులు కృపయ్య, సత్యనారాయణగౌడ్, చక్రధర్, నాగరాజు, సౌమిత్రి, నాయకులు శివప్ప, జయమ్మ, ఏసేపు తదితరులు పాల్గొన్నారు.



బ్యాగులు అందజేస్తున్న ఉపాధ్యాయులు

ఘనంగా స్వయం పరిపాలన దినోత్సవం



ధరూరులో స్వయం పరిపాలన దినోత్సవంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు

ధరూరు: మండల కేంద్రంలోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో స్వయం పరిపాలన దినోత్సవాన్ని మంగళవారం విద్యార్థులు ఘనంగా జరుపుకున్నారు. విద్యార్థులు ఉపాధ్యాయులుగా మారి పాఠాలు బోధించారు. ఈ సందర్భంగా ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు.కార్యక్రమంలో హెచ్ఎం జ్యోత్స్న, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

గట్టు: మండల పరిధిలోని తుమ్మలచెరువు మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాలలో విద్యార్థులు స్వయం పరిపాలన దినోత్సవాన్ని ఘనంగా జరుపుకున్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు బాలన్న, బాలరాజు, రాములు, కవిత, నర్సింహులు, శ్రీకాంత్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

అమరచింత మున్సిపాలిటీకి రూ.52లక్షలు మంజూరు

అమరచింత: మున్సిపాలిటీలో సీసీ రహదారుల నిర్మాణం కోసం మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ డైరెక్టర్, కమిషనర్ టీకే శ్రీదేవి రూ.52 లక్షలు మంజూరు చేశారు. ఫిబ్రవరిలో పట్టణాన్ని సందర్శించిన ఆమె మాజీ అడ్వకేట్ జనరల్ దేశాయి ప్రకాష్‌రెడ్డితో కలిసి పట్టణంలో బైపాస్ రహదారి కోసం ప్రతిపాదనలు చేసి.. ఈ మేరకు నిధులు కేటాయించారు. మున్సిపాలిటీలో నిధులు లేక అభివృద్ధి పనులు నిలిచిపోతున్నాయని, సీసీ రహదారుల నిర్మాణం అసంపూర్తిగా ఉన్నాయని మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్ మంగమ్మ, మున్సిపల్ కమిషనర్ రవిబాబు టీకే శ్రీదేవి దృష్టికి తీసుకెళ్లారని తెలిపారు. అడిగిన వెంటనే రూ.52 లక్షలు మంజూరు చేసిన మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ డైరెక్టర్‌కు కృతజ్ఞతలు తెలిపారు. కొత్తతండా రహదారి నుంచి మున్సిపల్ కార్యాలయ సమీపం నుంచి మరికల్ ప్రధాన రహదారి వరకు సీసీ రోడ్డు నిర్మాణం చేపట్టేందుకు నిధులు మంజూరు అయ్యాయని వెల్లడించారు.

అభివృద్ధికి దూరంగా 7వ వార్డు

మున్సిపల్ పరిధిలోని 7వ వార్డులో నేటి వరకు ఎలాంటి అభివృద్ధి పనులు చేపట్టకపోవడంతో వార్డు ప్రజలు అసహనం వ్యక్తం చేస్తున్నారు. పన్నులు కడుతున్నా కేవలం బీజేపీకి చెందిన కౌన్సిలర్ గెలుపొందాడని వార్డులో అభివృద్ధి పనులను నిలిపివేయడం ఏమిటని కాలనీవాసులు ప్రశ్నించినా పట్టించుకునే వారే కరువయ్యారు.